తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# చెత్తాచెదారంతో కంపుకొడుతున్న ఆర్టీసీ ప్రాంగణం

- సమస్యలకు కేరాఫ్ గూడూరు ఆర్టీసీ బస్టాండ్
- అధ్వానంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు - నిద్రమత్తులో అధికారులు

గూడూరు, జనవరి 17 ప్రభాతవార్త : గూడూరు ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బస్టాండ్‌లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇక్కడ పేరుకు తగ్గ వసతులు లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని మరుగుదొడ్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. మరింత అధ్వానంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు కనిపిస్తున్నాయి. జిల్లా నుంచి, గ్రామాల నుంచి వేలాది మంది వివిధ పనులపై గూడూరుకు వస్తుంటారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఆర్టీసీ ప్రాంగణంలో పరిశుభ్రత కరవైంది. ఎక్కడ చూసినా వ్యర్థాలు, మురుగు, పందుల విహారం కనిపిస్తుంది. గూడూరు నియోజకవర్గ కేంద్రమైనా ఆర్టీసీ ప్రాంగణంలో మాత్రం ఇదే పరిస్థితి కొనసాగుతోంది. సంబంధిత అధికారులు అక్కడే ఉన్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అక్కడ అడుగు పెడితే చాలు దుర్వాసన, పందులు, వ్యర్థాలు ఆహ్వానం పలుకుతాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శుభ్రత చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.



చెత్తాచెదారంతో దర్శనమిస్తున్న గూడూరు ఆర్టీసీబస్టాండ్ ప్రాంగణం

# అంతరిక్ష ప్రయోగ కేంద్రం... భద్రమేనా!

- మొన్నటిదాకా హుషార్ - నేడు వరుస ఆత్మహత్యలతో బేజార్ - సిఐఎస్ఎఫ్ జవాన్ల ఆత్మహత్యల కేసును శోధిస్తున్న పోలీసులు

శ్రీహరికోట (తడ), జనవరి 17 ప్రభాతవార్త : అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనలతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన షార్ కేంద్రంలో అసలు ఏం జరుగుతోంది. షార్‌ను కంటికి రెప్పలా చూసుకునే కేంద్ర పారిశ్రామిక భద్రత దళాలలో వరుస ఆత్మహత్యలు పలు అనుమానాలు కలిగిస్తున్నాయి. శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పడిన తర్వాత రెండురోజుల్లో ఇద్దరు జవాన్లు వేర్వేరు సంఘటనలలో ఆత్మహత్యలు చేసుకున్నారు. వీరిలో ఒకరు చెట్టుకు ఉరేసు కోగా, మరొకరు సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకొని చనిపో యారు. ఈ రెండు సంఘటనలు షార్ నిషిద్ధ ప్రాంతంలో కాకుండా అంతో ఇంతో జనసంచారం ఉన్న చోటే జరగడం పలువురిని భయభ్రాంతులకు గురిచేస్తోంది. షార్‌లోని రద్దీ ప్రాంతం జీరోపాయింట్‌కు సమీపంలో చత్తీస్‌ఘడ్‌కు చెందిన చింతామణి అనే యువకుడు చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. ఆ శవాన్ని శ్రీహరికోట పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టంకు తరలించేలోగానే మరో సంఘటన దిగ్భ్రాంతి కలిగించింది. సిఐఎస్ఎఫ్ ఎస్ఐ వికాస్‌సింగ్ షార్ మెయిన్‌గేటు వద్ద రివాల్వర్‌తో కాల్చుకొని చనిపోయాడు. ఈ సంఘటనలలో ఒకటి సంక్రాంతి పండగ రోజు జరగ్గా, మరొకటి కనుమ రోజు జరిగింది. మంగళవారం షార్‌తో పాటు సమీప గ్రామాలు, సూళ్లూరుపేట పట్టణంలో ఈ ఆత్మహత్యల సంఘటనలపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఆత్మహత్య చేసుకున్న వికాస్‌సింగ్ శవానికి ఇంకా పోస్టుమార్టం జరగలేదు. ఉత్తరప్రదేశ్ నుంచి ఆయన కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత పోస్టుమార్టం చేసి శవాన్ని అప్పగించే అవకాశం ఉంది. అంతకుముందు చెట్టుకు ఉరేసుకున్న సిఐఎస్ఎఫ్ జవాన్ చింతామణి కుటుంబ సమస్యలతోనే మరణించాడని కొందరు అంటున్నారు. ఈ జవాన్ తల్లిదండ్రులు గత నెలలోనే మృతి చెందారని, సోదరుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడని సహచరులు అంటున్నారు. ఇటీవలే పెళ్లిసంబంధం కూడా కుదిరినట్లు చెప్తున్నారు. కుటుంబ సభ్యులు క్రమేణా దూరమవడం, బాధలు ఎవరితోనూ పంచుకునే అవకాశం లేని కారణంగా చింతామణి మనోవ్యధతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని షార్‌లో కథనాలు వినిపించాయి. అయితే అదే సమయంలో ఎస్ఐ క్యాడర్‌లో కొంత ఉన్నత స్థితిలో ఉద్యోగం చేస్తున్న వికాస్‌సింగ్ మరణం అందరినోటా సస్పెన్స్‌గా ఉంది. కేవలం 33 ఏళ్ల వయస్సు ఉన్న ఈ ఎస్ఐ నవంబర్‌లోనే షార్‌కు బదిలీపై వచ్చారు. అంతకుముందు పనిచేసిన చోట కొన్ని సమస్యలు ఉన్నాయని, ఈ కారణంగానే షార్‌కు కుటుంబ సభ్యులు ఇప్పటిదాకా రాలేదని సమాచారం. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్న వికాస్ సింగ్ సైతం కుటుంబ సమస్యలతోనే మృతిచెంది ఉంటారని కొందరు అంటున్నప్పటికీ దాన్ని ఖండిస్తున్న వారూ లేకపోలేదు.



షార్‌ను కంటికి రెప్పలా చూసుకునే సిఐఎస్ఎఫ్ దళాలు

**షార్‌లోపల సకల సౌకర్యాలు**

శ్రీహరికోటలో కేంద్ర పారిశ్రామిక దళాలు గత ఆరు దశాబ్దాలుగా కాపలా కాస్తూనే ఉన్నారు. ఎంతో శిక్షణ పొంది ధైర్య సాహసాలతో ఇక్కడ విధులు నిర్వహించడానికి వస్తుంటారని అందరూ నమ్ముతున్నారు. శ్రీహరికోటలో వివిధ ప్రయోగ, పరిశోధన కేంద్రాలతో పాటు విశాలమైన షార్ అడవులు, అటు సముద్ర తీరం, ఇటు పులికాట్ తీరాలలో గస్తీ కాస్తుంటారు. ప్రత్యేకించి రాకెట్ ప్రయోగ సమయాలలో మొదటి, రెండవ గేట్లలో కూడా నిశితంగా తనిఖీలు చేస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా మీడియా వారిని సైతం ప్రతి బ్యాగును శోధించి లోపలికి పంపుతారు. వీరితో పలు సందర్భాలలో విఐపిలు, మీడియా ప్రతినిధులు కూడా వాదులాటకు దిగిన సందర్భాలు ఉన్నాయి. ఒక హోదా కలిగిన బాధ్యతతో విధులు నిర్వహించే సిఐఎస్ఎఫ్ దళాలంటే డ్రస్‌కోడ్ అంటే అందరికీ హడలే. అయితే ఎక్కువమంది ఉత్తరాది వారే ఈ దళాలలో ఉన్న కారణంగా స్థానికులు సైతం వీరికి భయపడుతూనే ఉంటారు. ఇటీవల పలు ప్రైవేటు కంపెనీలు సైతం షార్‌లోపల వివిధ పనులు దక్కించుకోవడంతో అక్కడికి వెళ్లే కూలీలను కూడా సిఐఎస్ఎఫ్ దళాలు శోధించి పంపిస్తుంటారు. వీరందరికీ శ్రీహరికోటలో పలుచోట్ల బ్యారక్‌లు ఉన్నాయి. హాస్టల్‌లాంటి వసతి సౌకర్యం కూడా ఉంది. సుమారు 1300 మంది సిఐఎస్ఎఫ్ సిబ్బంది షిఫ్టులవారీగా విధులు నిర్వహిస్తుంటారు. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ వారిలో ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నది ప్రస్తుత ప్రశ్న. ఇప్పటికే తిరుపతి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఈ వరుస సంఘటనలపై దృష్టిపెట్టారు. నాయుడుపేట డిఎస్పి, సూళ్లూరుపేట సిఐ శ్రీహరికోటకు వెళ్లి వరుస ఆత్మహత్యల కేసులకు సంబంధించి ఆరా తీసినట్లు తెలిసింది. మరోవైపు షార్‌లోని ఉన్నతాధికారులు కూడా గత మూడురోజులుగా ఈ సంఘటనల మీద సమీక్షిస్తున్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాకు కంకణం

- జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్



డ్రగ్స్ రహిత సమాజ ఆవిష్కరణ కోసం అధికారులతో సమావేశమైన డిఆర్ఓ

చిత్తూరు, జనవరి 17 ప్రభాతవార్త: డ్రగ్స్ రహిత జిల్లా కోసం కలసికట్టుగా కంకణం కట్టుకొని ముందడుగు వేయాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ పిలుపునిచ్చారు. డిఆర్ఓ ఛాంబర్‌లో మంగళవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో డిఆర్ఓ రాజశేఖర్ జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డితో కలిసి విద్యాశాఖ, ఇంటర్మీడియేట్ బోర్డు, ఒకేషనల్ కళాశాలల ప్రిన్సిపాళ్ళు, ఇతర సంబంధిత అధికారులతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ ఆవిష్కరణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాజశేఖర్ మాట్లాడుతూ కళాశాలల్లో విద్యనభ్యసించే యువత డ్రగ్స్ బారిన పడకుండా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో యాజమాన్యాలు పర్యవేక్షించాలన్నారు. అలాగే డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే దుష్ఫలితాలపై వారికి అవగాహన పెంచాలన్నారు. ఇందుకు సంబంధించి బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్‌లను ప్రతి కళాశాలలో ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే తరం దేశ భవిష్యత్తు, అభివృద్ధికి తోడ్పాటు అందించేలా కృషి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్ళల్లో ఈ అంశానికి సంబంధించిన బ్యానర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల భవిష్యత్తుకు సంబంధించి తల్లిదండ్రుల్లో ఎక్కువ ఆలోచన వుంటుందని, ఇలాంటి కార్యకలాపాలపై ఎవ్వైనా సమాచారం వుంటే 14500 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాలపై అన్ని కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన పెంచాలన్నారు. జిల్లాలో డ్రగ్స్ విక్రయించే ప్రాంతాలు, డ్రగ్స్‌ను జిల్లాలోకి తీసుకొని రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎఇఎస్ ఆయిషా, పివికెఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మీరాసాహెబ్, డిఎల్‌డిఓ రవికుమార్, డివైఇఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మాన్యువల్‌గా బిల్లులు ఎలా తీసుకొంటారు?

- 43 బిల్లు పుస్తకాలను స్వాధీనం చేసుకొన్న కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, జనవరి 17 ప్రభాతవార్త: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలోని పురసేవా కేంద్రంలో ఆస్తి, ఇతర పన్నులకు సంబంధించి మ్యానువల్‌గా బిల్లులు చెల్లిస్తుండటంతో వీటిని ఎందుకు ఇలా తీసుకొంటున్నారని కమీషనర్ డాక్టర్ జె.అరుణ ప్రశ్నించారు. పురసేవా కేంద్రంలో మ్యానువల్‌గా సిబ్బంది కట్టించుకొంటున్న బిల్లు పుస్తకాలను స్వాధీనం చేసుకొని ఈ విషయంపై విచారణ చేయాలని అధికారులను కమీషనర్ ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పురసేవా కేంద్రం, రెవెన్యూ సెక్షన్, ప్రజారోగ్య విభాగాలను కమీషనర్ అకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ పన్నుల వసూళ్ళకు సంబంధించి మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సిన నేపథ్యంలో కార్యాలయం ఆవరణలోని పురసేవా కేంద్రంలో మ్యానువల్ బుక్‌లు వున్నట్లు కమీషనర్ గుర్తించారు. ఈ మేరకు కార్యాలయంలో లభ్యమైన 43 మ్యానువల్ బిల్ పుస్తకాలను కమీషనర్ స్వాధీనం చేసుకొన్నారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారించాలని అధికారులను ఆదేశించారు. పన్నుల చెల్లింపుకు సంబంధించి మ్యానువల్ రసీదులు ఎట్టి పరిస్థితుల్లోను ఇవ్వరాదని చెల్లింపులు మొత్తం ఆన్‌లైన్‌లో జరుగాలని కమీషనర్ స్పష్టం చేశారు. అలాగే రెవెన్యూ విభాగంలో పన్నుల వసూళ్ళకు సంబంధించి పలు రికార్డులను ఆమె పరిశీలించారు. ఆస్తిపన్ను వసూలుకు సంబంధించి రిబేటు తదితర అంశాలపై నగరంలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. అనంతరం కమీషనర్ ప్రజారోగ్య విభాగంలో బర్త్ అండ్ డెత్ రిజిస్టర్లు, చలానాలను పరిశీలించారు. చాలానాల ద్వారా చెల్లించిన నగదు ఏ ఖాతాలకు జమ అవుతుందో తనిఖీ చేశారు. మ్యానువల్ బిల్లులను ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించవద్దని కమీషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అక్కడ అనుమతులు, ఇక్కడ ఆంక్షలు!?

సంక్రాంతి సాంప్రదాయాలపై...

-పాలకుల-జల్లికట్టు, కోడిపందేలు నియంత్రణపై జనం పెదవి విరుపు

- అత్యుత్సాహంలో పోలీసులు, ప్రేక్షక పాత్రలో పాలకులు

-లెక్కలు లేని పోలీసుల రికవరీ సొమ్ములు

ప్రభాతవార్త-తిరుపతి:

తెలుగుప్రజల సాంప్రదాయ పండుగల్లో సంక్రాంతి పర్వదినానికి ఎంతో ప్రత్యేకత ఉంది. గ్రామాల్లోనేగాక పట్టణాల్లో కూడా ఎంతో ఉత్సాహంతో జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి సంబరాల్లో సంక్రాంతి, కనుమ పండుగ రోజుల్లో ప్రత్యేకంగా జల్లికట్టు (ఎద్దుల పరుగుపందేలు), కోడిపందేలు జరుపుకుని ఆనందం వ్యక్తం చేయడం పరిపాటిగా వస్తోంది. అయితే రాష్ట్రం ఒక్కటే, ఆంక్షలు రెండుగా వున్నాయని, ఈ పండుగవాతావరణం రాష్ట్రంలోని ఉభయగోదావరి జిల్లాలు, కోనసీమ జిల్లాలతో బాటు తమిళనాడు సంస్కృతికి నిలయంగా ఉన్న ఉమ్మడి చిత్తూరు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో జోరుగా సాగుతుంది. ఈ ఏడాది ఈ పందేలకు చిత్తూరు జిల్లాలో పోలీసుయంత్రాంగం అడ్డుకట్టవేసింది. ఏకంగా ఎద్దుల పరుగు పందేలు (జల్లికట్టు),కోడి పందేలు జరపరాదంటూ ఆంక్షలు విధించింది. ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో ఈ పందేలు కనిపించకపోవడంతో పండుగ చేసుకున్నట్లు కూడా లేదని అధికశాతం ప్రజల కథనం. జిల్లాకు సరిహద్దుగా ఉన్న తమిళనాడు రాష్ట్రం సాంప్రదాయాలకు యధాతధంగా అనుమతివ్వడంతో అక్కడి ప్రజలు సంబరాలులో మునిగి పోయారు. అలాగే చిత్తూరు జిల్లాకు భిన్నంగా కోనసీమ జిల్లాలు, ఉభయగోదావరి జిల్లాల్లో ఏకంగా కొందరు ప్రజాప్రతినిధుల సమక్షంలోనే కోడిపందేలు జోరుగా సాగినట్లు తెలిసిన విషయం. పైగా బరులు కూడా సిద్ధం చేసి వేలల్లో వీక్షకుల టిక్కెట్లు విక్రయాలు జరిగాయంటే ఈ ప్రాంతంపై ఆంక్షలు అమలు చేయడంతో గ్రామీణప్రాంత ప్రజలు, సరదాగా పండుగ రోజు జరుపుకునే ఆటలకు అడ్డుకట్టవేయడంపై పెదవి విరుస్తున్నారు. తిరుపతి పరిసరాల్లోని చంద్రగిరి, రామచంద్రాపురం, ఏర్పేడు, శ్రీకాళహస్తి. సత్యవేడు, బిఎన్‌కండ్రిగ, నగరి, పుత్తూరు, చిత్తూరు, పలమనేరు, కుప్పం తదితర ప్రాంతాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున కోడి పందేలు, జల్లికట్టు నిర్వహించేవారు. కొంతవరకు నగదు లావాదేవీలు కూడా జరిగేది. కోడి పందేలు సందర్భంగా పోలీసుల దాడుల్లో దొరికిన సొమ్ములేకు లెక్కలు లేకపోవడంతో, పందెంరాయుళ్ళపై దాడులే ధ్యేయంగా పోలీసులు పనిచేస్తున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. అయితే ఈ ఏడాది అటు ప్రభుత్వం ఇటు పోలీసుల ఆంక్షలతో గ్రామీణ ప్రాంతాలు పండుగను ఉసూరుమన్నట్లు జరుపుకోవడం తప్ప ప్రత్యేకత ఏమీ లేదని జనం వాదన. ఏది ఏమైనా ప్రజల సాంప్రదాయాలపై ప్రభుత్వం ఆంక్షలు ఎంతవరకు మంచిదనే ప్రజలు బలంగా చర్చించుకుంటున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఒకలా మరికొన్ని జిల్లాల్లో, ప్రాంతాలపై మరోలా ఆంక్షలు విధించడంపై కూడా విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. పండుగ సంబరాల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తుండగా, నాయకులు మాత్రం ప్రేక్షక పాత్రలో వున్నారు.



# రాష్ట్ర ప్రజలకు ప్రతిరోజు పండుగే

- మంత్రి ఆర్.కె.రోజా



పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి రోజా, ఆలీ

నగరి, జనవరి 17 ప్రభాతవార్త: జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలకు ప్రతిరోజు పండుగే అని మంత్రి రోజా రోజా అన్నారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయిలో తన చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆమె ముగ్గులు పోటీలు నిర్వహిం చారు. పోటీలకు రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు ఆలీతో కలసి ఎద్దుల బండిపై ఆమె విచ్చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. పోటీల నిర్వహణలో భాగంగా మైదానంలో ఏర్పాటు చేసిన చిలకజోస్యం స్టాలు వద్ద ఆలీ, స్విమ్స్ డైరెక్టర్ వెంగమాంబ జోస్యం చెప్పించుకున్నారు. ఎంపీపీ భార్గవి, సీడీపీవో కృష్ణవేణిలకు మంత్రి మెహందీ పెట్టారు. పొంగళ్లు పెట్టి డూడూ బసవన్నకు పూజలు చేశారు. సంక్రాంతి పిండి వంటలను తెలిపే ఐసీడీఎస్ బజారులో మంత్రి అతిథులు పిండి వంటలను రుచి చూశారు. అనంతరం బహుమతుల పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ జగనన్న ప్రతి ఇంటికి ఏం చేస్తే సంతోషం ఉంటుందో వారి ఇళ్ళ వద్దకే వలంటీరును పంపి తెలుసుకుని ప్రతి సంక్షేమ పథకాన్ని వారి ఖాతాలకు వేసి వారిని ఆదుకుంటున్నారన్నారు. నేడు ఆనందంగా సంక్షేమ సంక్రాంతిని వారు జరుపుకుంటున్నారన్నారు. నగరిలో కొండచుట్టు కార్యక్రమానికి చాలా విశిష్టత ఉందని అందుకే ఈ రోజున పోటీలు నిర్వహించామన్నారు. సాంస్కృతిక మంత్రిగా సంప్రదాయాలు కాపాడాలన్న తపన, అక్కాచెల్లెలను సంతోషం పెట్టాలన్న కోరికే పోటీల నిర్వహణకు దారి తీసిందన్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికి ఆడపడుచుగా చీర, గాజులు పెట్టి పంపుతున్నా నన్నారు. రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు ఆలీ మాట్లాడుతూ ముగ్గులు చూస్తుంటే కష్టపడి వేసినట్లు లేదని ఇష్టపడి వేసినట్లు ఉందన్నారు. బహుమతి రానివారు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. డ్రామా వేస్తే నాకు తొలుత వచ్చిన బహుమతి లైఫ్‌బాయ్ సబ్బు అన్నారు. అదే నేడు ఈ స్థాయికి చేర్చిందన్నారు. విజేతలైన వారు ఎవరైనా వారు మన రాయలసీమ బిడ్డలే అని ఆనందపడాలన్నారు. కళాకారులుగా వచ్చాము కనుకే తోటి కళాకారులకు మంచి చేయడంలో మంత్రి రోజా ముందుంటారన్నారు. ఈ రోజు ఆమె చేసిన పండుగ ఏడాదంతా గుర్తు పెట్టుకునేలా ఉందన్నారు. తన సొంత ట్రస్టు నుంచి ఇంతటి ప్రోత్సాహం అందిం చడం అభినందనీయమన్నారు. స్విమ్స్ డైరెక్టర్ వెంగమాంబ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు అద్ధం పట్టేలా ఈ పోటీలు ఉందన్నారు. పోటీలు నిర్వహించే ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. సంక్రాంతి పండుగంటే అందరికి గుర్తు వచ్చేది ముగ్గులు, అలాంటి పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. తుడా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యత సంతరించుకునే కొండచుట్టు ఉత్సవాల సందర్భంగా పోటీలు జరగడం ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్‌లు పి.జి.నీలమేఘం, హరి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్, ఎంపీపీలు భార్గవి, దీప, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బాలన్, వెంకటరత్నం, జయప్రకాష్, సీడీపీవో కృష్ణవేణి, వైస్‌ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, ఆర్‌బీకే చైర్మన్‌లు, ఆలయ కమిటీ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుణ్యక్షేత్రంలో దోమల మోత!

-విషజ్వరాలతో తల్లడిల్లుతున్న జనాలు -ప్రైవేటు ఆస్పత్రులు కిటకిట

శ్రీకాళహస్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త : స్వచ్ఛ భారత్ సాధిద్దాం, స్వచ్ఛ శ్రీకాళహస్తిగా తీర్చి దిద్దుదాం.. అన్న మాటలే తప్ప చేతల్లో పురపాలకశాఖ అధికారులు ఏమి చేయలేకపోతున్నారు. దీంతో పుణ్యక్షేత్రంలో దోమలు మోతతో ప్రజలు, భక్తులు తల్లడిల్లుతున్నారు. గత పదిరోజులుగా కురిసిన వర్షాల కారణంగా దోమలు ప్రబలుతున్నాయి. పురపాలక సంఘంలోని మురికివాడల్లో అయితే ఇక చెప్పాల్సిన అవసరం లేదు. దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు, చిన్నా, పెద్ద, తేడా లేకుండా జ్వరాల బారిన పడి ఆస్పత్రుల బాట పడుతున్నారు. దీనికి తోడు ప్రైవేటు క్లినికల్ ల్యాబ్‌ల ముందు రక్తపరీక్షలకోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇక దోమల బాధ అంటారా విపరీతంగా మారింది. పగలు రేయి తేడా లేకుండా ఝుమ్మని సంగీతాన్ని వినిపిస్తున్నాయి. దోమల బాధతో జనం విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారు.'ఎలుకకు ప్రాణ సంకటం పిల్లి చెలగాటమన్నట్లు' పాలకుల పరిస్థితి మారింది. జనం దోమల బాధతో తల్లడిల్లుతున్న కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదంటే ప్రజారోగ్యంపై పురపాలక అధికారులకు ఎంతమాత్రం శ్రద్ధ ఉందో అర్థమవుతుంది. అప్పుడప్పుడు మాత్రం వీధుల్లో ఫాగింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అయితే టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు మాత్రం ప్రబలుతున్నాయి. ప్రభుత్వ వైద్యశాలలోమాత్రం ఏం నమోదు కాలేదని చెప్తున్నా, ప్రైవేటు వైద్యులచే పరీక్షలు చేయించుకుని ల్యాబ్‌ల ద్వారా వచ్చిన రిపోర్టులు మాత్రం పాజిటివ్‌గా నిర్ధారణ అవుతోంది. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మురికివాడల్లో పారిశుద్ధ్యం అధ్వాన్నం:**

శ్రీకాళహస్తి పట్టణంలో దోమలబాధ విపరీతమైంది.జనం విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారు. దోమలు ఈగల్లా మారాయి. పగలు రేయి తేడా లేకుండా సంగీతాన్ని వినిపిస్తున్నాయి. ఓ వైపు ఎటు చూసినా ప్రజలు విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారు. ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోవడం మానేశారు. వార్డుల్లో ఫాగింగ్ చేస్తున్నట్లు చెబుతున్నారు కానీ ఆచరణలో ఏమి జరగటం లేదు. ఒక వేళ ఫాగింగ్ చేసినా నాలుగు మాడా వీధులకే పరిమితం అవుతున్నారు. గతంలో డెంగ్యూజ్వరాలు వచ్చి చిన్నారులు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అయినా మున్సిపల్ అధికారులు తాత్కాలికంగా ఫాగింగ్‌చేశామన్నట్లు జరిపి పరికరాలను మూలపడేశారు. పట్టణంలోని మురుగునీటి కాలువలు పురాతనకాలం నాటివి. ఇక జ్వరం వచ్చిందంటే పట్టణంలోనిప్రైవేటు ఆస్పత్రులు ఫుల్‌గా రోగులతో నిండిపోతున్నాయి. ఓవైపు మలేరియా, టైఫాయిడ్, మరోవైపు డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్నాయి. మరి అధికారులు ఏం చర్యలుతీసుకుంటారో వేచి చూడాల్సిందే.



పట్టణంలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

# దేశ వ్యాప్తంగా వైద్యుల రక్షణ చట్టం... అమలు చేయాలి

- కేంద్ర మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవర్‌కి డాక్టర్ శ్రీహరి రావు, ఐఎంఏ తిరుపతి శాఖ అధ్యక్షులు డాక్టర్ యుగంధర్, బృందం సభ్యుల వినతి

తిరుపతి నగరం, జనవరి 17 ప్రభాతవార్త : వైద్యులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా వైద్యుల రక్షణ చట్టం అమలు చేయాలని కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవర్‌ను మంగళవారం ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహరి రావు, ఐఎంఏ తిరుపతి శాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ యుగంధర్, ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసుదేవనాయుడు, తిరుపతి శాఖ సభ్యులు డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ గతంలో ఏపీ మాజీ సీఎం స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వైద్యుల రక్షణ కోసం దేశంలోనే మొట్టమొదటి సారిగా ఏపీ వైద్యుల రక్షణ చట్టాన్ని (జీ.నెం 11 ఆఫ్ 2008) చట్టాన్ని తీసుకుని వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ చట్టం ద్వారా దోషులకు మూడు సంవత్సరాల శిక్ష, నాన్ బెలబుల్ చట్టాన్ని తీసుకుని రావడం జరిగిందని తెలిపారు. అయితే నేడు వచ్చిన చట్టం ప్రకారం ఏడు సంవత్సరాల శిక్ష ఉంటే అది నాన్ బెయిల్ బుల్ శిక్షగా పరిగణించడం బాధాకరమని మంత్రికి విన్నవించారు. ఈ మధ్య కాలంలో చాలా రాష్ట్రాలలో వైద్యులపై అనేక దాడులు చేయడంతో పాటు అమానుషంగా చంపివేయడం జరుగుతుందని ఆమెకు వివరించారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని దేశ వ్యాప్తంగా వైద్యుల రక్షణ కోసం ఒకే చట్టాన్ని తీసుకుని రావాలని కోరారు. అప్పుడే ఆస్పత్రులు, వైద్యులకు రక్షణ ఉంటుందన్నారు. చైనాలో ఉన్న సమగ్ర వైద్య విధానాన్ని భారత దేశానికి తీసుకుని రావడంతో పాటు దేశంలోని అన్ని వైద్య విధానాలను కలిపి 2030 నుంచి అల్లోపతి, ఆయుర్వేద, హోమియోపతి, ఆయుష్ వైద్య విధానాలను వైద్య విద్యార్థులకు నేర్పించాలని కేంద్ర ఆలోచన మంచిదని అయితే అందులోని చెడును కూడా గుర్తించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని 650 వైద్య కళాశాల నుంచి ప్రతి సంవత్సరం దాదాపు లక్ష మంది వైద్య విద్యార్థులు ఆధునిక వైద్య ప్రావీణ్యులై ప్రజలకు అందుబాటులో ఉన్నారని, కేంద్రం తీసుకుని వస్తున్న ఈ సమగ్ర వైద్య విధానాన్ని (కిచిడి) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి ప్రధానంగా దేశం ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐఎంఏ నేతలు, బృందం సభ్యులు విన్నవించిన విజ్ఞప్తులపై మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కేంద్రంతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ శ్రీహరి రావు, ఐఎంఏ తిరుపతి శాఖ అధ్యక్షులు డాక్టర్ యుగంధర్, బృందం సభ్యులు

# ద్విచక్రవాహనం ఆర్టీసీ బస్సులఢీ-ఇద్దరి మృతి

భాకరాపేట జనవరి17 ప్రభాతవార్త :
భాకరాపేట ఘాట్‌రోడ్డులో ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొన్నఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయ పడిన ఒకతనిని 108 వాహనంలో తిరుపతి రూయాకు తరలించారు. భాకరాపేట పోలీసులు తెలిపిన వివరాల మేరకు కేవీపల్లె మండలంలోని నూతన కాల్వ నుండి ద్విచక్ర వాహనంలో ముగ్గురు యువకులు తిరుపతికి వస్తూ మార్గమధ్యంలో భాకరాపేట ఘాట్‌రోడ్‌లో పీలేరు డిపోకుచెందిన ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ఈఘటనలో తిరుపతి సత్యనారాయణ పురంలో



ఉంటున్న సాయికృష్ణ(22) అతని స్నేహితుడు హేమంత్(20) అక్కడికక్కడే మృతి చెందారు. వీరి స్నేహితుడు శివకుమార్ హైదరాబాదులో ఉంటున్నాడు. అతని సొంత ఊరు నూతన కాల్వకు రాగా స్నేహితులను పండుగకు ఆహ్వానించాడు. పండుగ ముగించుకుని ముగ్గురు తిరుపతికి బయలుదేరి వెళుతుండగా మార్గమధ్యంలో ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలికి చేరుకుని బోరున విలపించారు. ఈమేరకు భాకరాపేట సీఐ తులసీరామ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు సద్వినియోగం

– పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్

యాదమరి, జనవరి 17 ప్రభాతవార్త:



ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు నడుం బిగించాలని యాదమరి పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కొట్టాలం గ్రామంలో జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవల్లో ఆయన పాల్గొని, ప్రతి నెలా మీ గ్రామంకు వైద్య బృందం వచ్చి వైద్య సేవలు అందిస్తారని వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవవాలని పిలుపు నిచ్చారు. సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని భావించి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ వైద్య శిబిరంలో 14 రకాల వైద్య పరీక్షలు చేస్తారని, అలాగే 67 రకాల మందులను ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. అలాగే చిన్న పిల్లలకు వైద్యంతో పాటు అక్కడే మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి దివ్యశ్రీ, మహిళా ఆరోగ్య కార్యకర్త శైలజ, ఆశా కార్యకర్తలు మీరా, కళావతి తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ విజేత వెంకటాద్రి జట్టు

బంగారుపాళ్యం, జనవరి 17 ప్రభాతవార్త:




స్థానిక సరోజిని హైస్కూల్ సమీపంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు నాలుగు రోజుల పాటు జరిగాయి. బంగారు పాళ్యంకు చెందిన వెంకటాద్రి జట్టు, దావుద్‌ఖాన్ జట్లు ఫైనల్‌లో పోటీ పడ్డాయి. చివరికి దావుద్‌ఖాన్ జట్టుపై వెంకటాద్రి జట్టు విజయం సాధించింది. గెలుపొందిన వెంకటాద్రి జట్టుకు, అలాగే దావూద్‌ఖాన్ జట్టుకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.

## శుభమస్తు షాపింగ్ మాల్ ముగ్గుల పోటీలు

వడమాలపేట, జనవరి 17 ప్రభాతవార్త:



శుభమస్తు షాపింగ్ మాల్ తిరుపతి, మన ఊరిసేవా ఫౌండేషన్ సంయుక్తంగా ముగ్గుల పోటీల నిర్వహించారు. పండుగల సందర్భంగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగవల్లుల పోటీలు వడమాలపేట, రామచంద్రాపురం మండలాల్లో నిర్వహించగా మహిళలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేసి బహుమతులు గెలుచుకున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన అభ్యర్థులకు శుభమస్తు షాపింగ్ మాల్ తిరుపతి గిఫ్టులను బహుమతిగా అందజేయడం జరిగింది. కార్యక్రమంలో పత్తి పుత్తూరు గ్రామ సర్పంచ్ తులసి, అప్పలాయగుంట మాజీ ఎంపీటీసీ సభ్యులు లలిత, మునిశంకర్, శుభమస్తు షాపింగ్ మాల్ మేనేజర్ గిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రంకేసిన కొడెగిత్తలు ....పౌరుషంతో బరిలోకి దిగిన యువకులు

– జన సంద్రంగా మారిన బ్రాహ్మణపల్లె

– అంబరానంటిన సంక్రాంతి సంబరాలు

వెదురుకుప్పం, జవనరి 17 ప్రభాతవార్త :



సంక్రాంతి సంబరాలలో భాగంగా కనుమ పండుగ పురస్కరించుకుని నిర్వహించు జట్టుకట్టు సంబరాలు అంబరాన్ని అంటాయి.... కొడేగిత్తలు రంకేలు వేయడంతో యువకులు పౌరుషంతో బరిలోకి దిగడంతో బ్రాహ్మణపల్లెలో జలికట్టు సంబరాలు అంబరాన్ని తాకాయి. రైతులు గిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి, చెక్క పట్టీలు కట్టి అందంగా అలంకరించారు. ఇష్ట దైవం, రాజకీయ నాయకులు, సినీ నటుల ఫోటోలతో కొమ్ములకు చెక్క పట్టీలు, టవలు, నగదు కట్టి యువత పై బరిలోకి దించారు. జన సంద్రంగా మారి పెద్ద సంఖ్యలో జనం చేరుకోవడంతో మిద్దెలు, వీధులు జన సంద్రంగా మారిపోయాయి. అలంకరించి గిత్తలను దప్పుల దరువులు మధ్య అల్లె వద్ద వదలడంతో యువ కులు రెట్టించిన ఉత్సహంతో బరిలోకి దిగి చెక్క పట్టీల కోసం గిత్తలతో కుస్తీకి దిగడంతో ఈలలు, కేరితల నడుమ నువ్వ ... నేన అంటూ పోటా పోటీగా పోరు జరిగింది. కొన్ని గిత్తలు దొరికిపోవడంతో యువకులు చెక్క పట్టీలను చేజికించుకుని విజయదరహాసంతో కేరితలు కొట్టారు. చెదురు మదురు సంఘటలు మినహా అద్యంతం పోటీలు రసవత్తంగా మారాయి. చుట్టపక్కల మండలాల నుంచి జనం తరలివచ్చారు.

## నవరత్నాలతోనే పేదల అభివృద్ధి : ఎమ్మెల్యే

బంగారుపాళ్యం, జనవరి 17 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకం ద్వారా పేదలు అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. మంగళవారం శేట్టేరి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి అభివృద్ధి చేసిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడాలని లక్ష్యంతో సిఎం నవరత్నాలు పథకంకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటిసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, తహసిల్దారు బెన్నురాజ్, వైకాపా నాయకులు దొరస్వామి, నాగరాజు, మహేంద్ర, అన్ను, సిద్ధు, రఘుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## 21న కాణిపాకంలో తై అమావాస్య వేడుకలు

కాణిపాకం, జనవరి 17 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 21న "తై అమావాస్య" వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు తెలిపారు. ఈసందర్భంగా దేవస్థానం వారిచే ఉదయం స్వామివారికి సంప్రదాయ బద్ధంగా పంచామృతాభిషేకం నిర్వహించి సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు,ఉభయదారులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## నేటి నుండి అఖండ జ్యోతితో కూడిన అఖండ ధ్యానము

తవణంపల్లె, జనవరి 17 ప్రభాతవార్త:

మండలంలోని అరగొండ–చిత్తూరు రహదారిలోని సిద్ధపంల్లె వద్ద వెలసిన చిత్తూరు జిల్లా స్పిరుచ్యువల్ సొసైటీ మరియు గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని శ్రీవిఘ్నేశ్వర పిరమిడ్ శక్తి క్షేత్రం నందు ఈనెల 18 నుండి 29 వరకు అఖండ జ్యోతితో కూడిన అఖండ ధ్యానము కార్యక్రమంను నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు బి.గోపాలకృష్ణమూర్తి తెలిపారు. క్షేత్రంలో బస చేసే వారు తప్పని సరిగా బెడ్‌షీట్‌ను వెంట తీసుకురావాలని తెలిపారు. ఈకార్యక్రమంను మండల పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉత్సాహంగా పశువుల పండుగ

సోమల,జనవరి17 ప్రభాతవార్త :

మండల పరిదిలోని పొదలగుంటపల్లె గ్రామంలో మంగళవారం పశువుల పండుగను అందరు ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈమేరకు గ్రామంలోని యువత గ్రామంలో నలువైపులా రకరకాల కాగితాలతోను,పూలతోను మామిడి తోరనాలతోను అలంకరించారు. పశువులను అందగాం అలంకరించి స్థానిక ఆలయం వద్దకుతీసుకుపోయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పశువులను బెదిరించారు.డప్పు వాయిద్యాలతో పశువులను పరుగెత్తించారు. యువకులు పరుగులు తీస్తున్న ఎద్దులను పట్టుకోవడారికి పరుగులు పెట్టారు. వీటిని చూడటానికి మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలోతరలి వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

## ఘనంగా సుబ్రమణ్యస్వామికి అభిషేకాలు

సదుం,జనవరి17 ప్రభాతవార్త :



స్థానిక గార్గేయనది ఒడ్డున ఉన్నజైసీ తారామ ఆశ్రమంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమ ణ్యస్వామి వారి ఆలయంలో మంగళవారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వ హించారు. అదే విధంగా పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు వినియోగించారు. కార్యక్రమం లో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు వెంకట రమనారెడ్డి, సభ్యులు మురళీ, మోహ న్‌రెడ్డి, కమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్



కుప్పం, జనవరి 17 ప్రభాతవార్త :

కుప్పం – పలమనేరు జాతీయ రహదారిలో గణేష్‌పురం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేసు_ండగా అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యకు_లు పట్టుబడినట్లు రూరల్ సిఐ రియాజ్ అహ్మద్ తెలిపారు. ఐడి పార్టీ సిబ్బంది నటరాజ్, రత్నం, అరుణాచలం, గుడుపల్లె పోలీసులు గణేష్‌పురం వద్ద వాహనాలు తనిఖీ చేసు _ండగా ఇద్దరు వ్యక్తులు నడుచుకుని వస్తూ పోలీసులను చూసి పారిపోయే యత్నం చేశారన్నారు. అనంతరం వారిని వెంబడించి పట్టుకోగా నాలుగు కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితులు కుప్పం మండలం మంకలదొడ్డి పంచాయతీ కొనైకుంటకు చెందిన సత్యవేలు (31), గోపి (29)లను అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ప్రగతి సేవాసంస్థ దాతృత్వం

· గూడూరు, జనవరి 17 ప్రభాతవార్త :

గూడూరులోని బాలాజీనగర్‌లో ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో మంగళవారం ఎస్.ఆర్ముగం 20వ వర్ధంతి సందర్భంగా రమేష్ బేకరి అధినేత ఎస్.రమేష్ సహకారంతో 60 మంది మహిళలకు చీరలు, చికెన్ బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. రమేష్ బేకరీ అధినేత రమేష్ మాట్లాడుతూ సమాజ సేవకులకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. అలాంటి వాటిలో ప్రగతి సేవాసంస్థ ముందుంటుందని చెప్పారు. మానవత్వంతో సమాజానికి చేస్తున్న సేవలకు ఎప్పుడూ మంచి ఆదరణ ఉంటుందని అన్నారు. అందుకే ఆ సంస్థ ఎంతో మంది మన్ననలు పొందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, సెక్రటరి జి.చంద్రశేఖర్, ట్రెజరర్, కాటూరు శ్రీనివాసులు, పొణకా మల్లికార్జునరెడ్డి, గోపి, ఆర్‌ఆర్ ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుధాకర్, కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్‌రావు, పి.డి.కరిముల్లా, వాచ్‌షాప్ రాము, కెఆర్‌ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, పి.శీను, నాగరాజు, కృష్ణారెడ్డి, సివిఆర్ న్యూస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లపు ఊట ధ్వంసం...నిందితుడు అరెస్టు

వెంకటగిరి, జనవరి 17, ప్రభాతవార్త:



వెంకటగిరి ఎక్సైజ్ పరిధిలోని వెలికల్లు గ్రామానికి చెందిన శివశంకర్‌ను అరెస్టు చేసి నాటు సారా బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. నిందితుడిని రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. నాటుసారా స్థావరాలపై నిఘా పెట్టినట్లు తెలిపారు.

## నేడు వైసీపీ కార్యాలయానికి భూమి పూజ

వెంకటగిరి, జనవరి 17 ప్రభాతవార్త:



నియోజకవర్గ స్థాయి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి బుధవారం ఉదయం భూమి పూజ చేస్తున్నట్లు రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్ మెంట్ బోర్డ్ ఛైర్మన్, వైసీపీ నియోజకవర్గ నవుస్వయంకర్త నేదంరంవల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ నాయకులు చెలికం శంకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, కడప బ్రహ్మయ్య, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

నాయుడుపేట, జనవరి 17 ప్రభాతవార్త :

జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మంగళవారం నాయుడుపేట మున్సిపాలిటీలోని భూపయ్య కాలనీ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ



కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, కలికి మాధవరెడ్డి, మునస్వామి నాయుడు, లాయర్ కుమార్, వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ఎస్‌కె షబ్బీర్, దారా రవి, అశోక్, వైసీపీ నాయకులు సిద్ధయ్య, కటకం జయరామయ్య, ఎంసిఆర్, భాస్కర్‌రెడ్డి, రాహుల్, వంశీ, వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో అనుమానితులు

కోట, జనవరి 17 ప్రభాతవార్త :

కోట మండలం విద్యానగర్‌లో ఎస్ఐ పుల్లారావు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా కారులో వెళుతున్న ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వీరు గూడలి పంచాయతీ ప్రకాశం కాలనీ వాసులుగా, పాత నేరస్తులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే వారు ఉపయోగిస్తున్న కారు బాడుగ కారుగా తెలిసింది. వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.

## ప్రారంభమైన ముఖ హాజరు

కోట,జనవరి 17 ప్రభాతవార్త :

ఇన్నాళ్లు హాజరు పట్టికలో సంతకం,బయోమెట్రిక్ వేసిన ప్రభుత్వ ఉద్యోగులంతా మంగళవారం నుంచి ముఖ అధారిత హాజరును నమోదు చేసుకొన్నారు.జిల్లా కేంద్రాల్లో పనిచేస్తున్న వారికి,ఉపాధ్యాలయలకు ఇప్పటికే ఈవిధానం అమల్లో ఉంది. ఈనెల 16 నుంచి మిగిలిన అన్ని స్దాయిలో ఉద్యోగులకు తప్పనిసరి చేసింది.సోమవారం కనుమ సందర్భంగా సెలవు కావడంతో మంగళవారం నుంచి ఈప్రక్రియ అమల్లోకి రావడంతో సంక్రాతి సందర్భంగా ఊరువెళ్లానవారంతాఉరుకులుపరుగులపై రావాల్సిన పరిస్దితి నెలకొంది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

తవణంపల్లె, జనవరి 17 ప్రభాతవార్త:



మండలంలోని మత్యంక్రాస్–బంగారుపాళ్యం రోడ్డులోని బాపినాయుడుపల్లె గ్రామ సమీపంలో మంగళవారం మోటారు సైక్లిస్టను బులోరో వాహనం డీకొనడంతో ఒక యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. సంఘటనకు సంబందించి స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని జొన్నగురకల గ్రామ పంచాయతీ నీలంపల్లె ఎస్సీవాడకు చెందిన ఎస్.కృష్ణయ్య కుమారుడు హర్షవర్దన్ అనే యువకుడు టీవీఎస్ మోటారు సైకిల్‌పై వెళుతుండగా బామినాయుడు పల్లె గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బులోరో వాహనంను సుధాకర్ అనే వ్యక్తి అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ డీకొనడంతో డీకొన్నాడు. దీనితో మోటారు సైకిల్‌పై వెళుతున్న హర్షవర్దన్‌ఉ తీవ్రగాయాలయ్యాయి. ఇతన్ని వెంటనే చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు బాదితుని_ండ్రి కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

కుప్పం, జనవరి 17 ప్రభాతవార్త :



విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవ రాయల జయంతిని కుప్పంలో శ్రీకృ ష్ణ దేవరాయల బలిజ సేవా సంఘం అధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఈసందర్భంగా రాయల వారి చిత్రపటానికి పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గోపీనాథ్, నేతలు సత్యేంద్రశేఖర్, మంజునాథ్, ఆర్‌ఆర్ రవి, త్రిలోక్, నాను, చలపతి, మంజునాథ్,బగ్గిడి వెంకటేష్, వెంకటేష్, శ్రీనివాసులు, సత్యనారాయణ, నాగరాజు, రాజేంద్ర, లోకేష్, శివరాయల్ పాల్గొన్నారు.

## తెలుగుమహిళ అధ్యక్షురాలుచే అన్నదానం

కుప్పం, జనవరి 17 ప్రభాతవార్త :



కుప్పం నియోజకవర్గ తెలుగు మహిళ విభాగం అధ్యక్షురాలు అనసూయ అధ్వర్యంలో మంగళవారం కుప్పంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా ఆమె తన కుమార్తె జన్మదినం సందర్భంగా ఐదువందల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు మంజునాథ్, ఆర్‌ఆర్ రవి, త్రిలోక్, సుగుణమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబునాయుడుకు వివాహ ఆహ్వానపత్రిక అందజేత

కుప్పంరూరల్, జనవరి 17 ప్రభాతవార్త :



తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడుకు వివాహ ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించినట్లు తెదేపా యువనేత గిరి తెలిపారు. నారావారిపల్లిలో అధినేత చంద్రబాబును కలిసి తన సోదరుడు కరుణాకర్ వివాహంకు పత్రిక అందించి ఆహ్వానించగా సమయం కుదిరితే తప్పక వస్తానని చంద్రబాబు పేర్కొన్నట్లు గిరి తెలిపారు.

# అంబరాన్నంటిన కొండచుట్టు వేడుకలు

**-శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వెంట ద్రౌపథీ భీమ అర్జునులు**
**-పొలిమేర వరకు వెళ్ళి సాగనంపిన గ్రామదేవతలు**



**చంద్రగిరి, జనవరి 17 ప్రభాతవార్త:**
సత్యప్రమాణాలకు నెలవైకొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ కొండ చుట్టు పండుగ వేడుకలు అంబరాన్నంటాయి. చంద్రగిరి గ్రామదేవతగా భక్తుల కొంగుబంగారమై వెలుగొందుతున్న శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో సంక్రాంతి మహోత్సవాలను ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారికి వేకువజామున అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని వివిధ సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి అశ్వవాహనంపై అధిష్టింప జేశారు. తదుపరి ఆలయం నుండి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ధర్మరాజుల ఆలయం వద్దకు చేరుకున్నారు. కొండచుట్టు మహోత్సవాలలో అమ్మవారికి తోడుగా భీమసేనుడు, అర్జునుడు, ద్రౌపధి సమేతంగా అనుసరిస్తూ భక్తరక్షణకు బయలుదేరారు. సాయంత్రం ధర్మరాజుల వారి ఆలయం నుండి బయలుదేరిన అమ్మవారిని అంకాలమ్మ వారు, మిట్టగంగమ్మ వారు, ముత్యాలమ్మ వారు నాగాలమ్మ మలుపు వరకు వెళ్ళి సాగనంపారు. ఈ రాత్రికి అమ్మవారు చంద్రగిరి పాతపేట, వెంకటంపేట, అగరాల, ఐతేపల్లి, పులిత్తివారిపల్లి, కొటాల, నాగయ్యగారిపల్లి, రెడ్డివారిపల్లి మీదుగా ప్రజలకు దర్శనమిస్తూ తిరిగి చంద్రగిరికి బుధవారం ఉదయం చంద్రగిరికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాలలో ప్రజలు తమను అనుగ్రహించేందుకు విచ్చేస్తున్న అమ్మవారి రాకకు గ్రామస్థులు రాత్రి వేళ పూర్తి స్థాయిలో నిరీక్షించడం జరుగుతుంది. ఈ క్రమంలో గ్రామస్తులకు, వాహన మోతదారులకు అన్నదానాలు, తేనీరు వంటివి ఏర్పాట్లు చేస్తారు. చంద్రగిరిలోనే కాకుండా ఈ గ్రామీణ ప్రాంతాల ప్రజలు కొండచుట్టును స్థానిక పండుగగా భావించి అత్యంత పవిత్రంగా జరుపుకుంటారు. ఈ పండుగకు ఎక్కడెక్కడో వు ంటున్న వారంతా స్వస్థలానికి చేరుకుని ఇంటిల్లపాధి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారికి కర్పూర నీరాజనా లర్పించడం సంప్రదాయంగా వస్తున్నది. అమ్మవారి వాహనసేవలో పాల్గొన్న భక్తులను వీక్షిస్తే నేల ఈనిందా అన్నచందంగా పోటెత్తిన భక్తజనానికి అవసరమైన సేవలందించడంలో డిఎస్పీ నరసప ్ప ఆధ్వర్యంలో సిఐ ఓబులేష్, ఎస్ఐలు వంశీధర్, హిమబింధు, సబ్ డివిజన్ పరిధిలోని పలువురు సిఐలు, ఎస్ఐలు, ఆర్మ్డ్, పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తాం : ఎంఎల్ఏ

**తొట్టంబేడు, జనవరి 17 ప్రభాతవార్త :**



జగనన్న నవరత్నాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అర్హులందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందుతాయని ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవరం లేదని ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గడపగడపకు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దకనపర్తి సచివాలయ పరిధిలోని పెద్దకనపర్తి, హరిజనవాడ, చిన్నకనపర్తి హరిజనవాడ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్బంగా పలువురు నాయకులు, గ్రామస్తులు ఎంఎల్ఏకు బ్రహ్మరథం పట్టి పూలవర్షం కురిపించారు. అనంతరం ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలుతీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, తంగేళ్ళపాళెం సింగిల్‌విండో ఛైర్మన్ మోహన్‌కిషోర్‌నాయుడు, సర్పంచ్ విమలగోపి, ఎంపిటిసి సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ మునిరత్నం, మణినాయుడు, రామకృష్ణ నాయుడు, చెంగల్రాయులు, గాలిబాలాజీనాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, పార్ధసారధి నాయుడు, సుబ్రమణ్యంనాయుడు, అంజూరువసంత్‌రావు, వెంకటేశ్వర్లునాయుడు, పార్థసారధినాయుడు, సుబ్రమణ్యంనాయుడు, కనకాలదేవేంద్ర, రఘురాం, బుద్ధాకిషోర్, దేవేంద్ర, సురేష్, చంద్ర, పేళ్ళరుదాము, సుబ్రమణ్యం, వీరాస్వామి, ప్రసాద్, శివ, అంకయ్య, జయరామయ్య, రాజారత్న, నాగరాజు, ప్రభాకర్, శివారెడ్డి, వెంకటేష్, సుబ్బయ్య, జగదీశ్వర్‌రెడ్డి, రాజయ్య, మునిశేఖర్, నరేంద్ర, రమణయ్య నాయుడు, రమణారెడ్డి, దీపక్‌రెడ్డి, చోడవరం, భాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గంధంశీను, రాజేంద్ర, మోహన్, సూరమాలవెంకటయ్య, పిల్లమేడు గురవయ్య మరియు ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి, మండలాధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. చంద్రయ్యనాయుడు, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపిటిసి వేమాలయ్య, సచివాలయ కన్వీనర్ రఘురామయ్య, సురేఖ, గంగాధర్‌ఎడ్డి, అలంకారయ్య, పెంచలయ్య, ముని, కోటి, శ్రీను, వెంకటేష్, చంద్రయ్య, పెంచలయ్య, దేవేంద్ర, వెంకటేష్‌నాయుడు, రమణయ్య, మునిరత్నం, భక్తవత్సలం, గరటారెడ్డి, డిల్లీబాబు, భాస్కర్, గంగాధరం, మణి, రాజేంద్ర, ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, మండలాధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సొసైటీ ఎన్నికలు లేనట్లే..!

**- కొనసాగనున్న త్రిసభ్య కమిటీలు**

**కోట, జనవరి 17 ప్రభాతవార్త :**
సహకార ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటి ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. మూడున్నరేళ్లుగా సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో నామినేటెడ్ పద్ధతిలో రాజకీయ నాయకులను త్రిసభ్య కమిటీల పేరుతో కొనసాగిస్తున్నారు. వీటికి 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఎన్నుకోగా, 2018 ఫిబ్రవరితో వాటి పదవీకాలం గడువు ముగిసింది. అప్పట్లో తెలుగుదేశం ప్రభుత్వం పాత పాలకవర్గాలనే ఏడాది పాటి కొనసాగించింది. 2019 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, సాధారణ ఎన్నికల షెడ్యూలు ఎన్నికలు రావడంతో సొసైటీలకు ఎన్నికలు జరగలేదు. మూడేళ్ల క్రితం ఎన్నికల కోసం కసరత్తు చేసినా ప్రక్రియ ఆగింది. 2020లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన సమయంలోనే నిర్వహిస్తారని అంతా ఊహించారు. సొసైటీల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేసినా ఎన్నికలు జరగలేదు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పాలకవర్గాలను రద్దు చేసి 2019 ఆగస్టులో త్రిసభ్య కమిటీలను తెరపైకి తెచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు వీటి పదవీకాలం పొడిగిస్తూ వస్తోంది. మళ్లీ 2021 ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించాలనుకున్నా కొవిడ్ కారణంగా ఆగిపోయాయి. అప్పటి నుంచి ఉన్న పాలకవర్గాలను ఆరునెలల పాటు పొడిగించారు. ప్రస్తుతం నామినేటెడ్ పాలకవర్గాలు కొనసాగుతున్నాయి. తాజాగా వీటి గడువు జనవరి 31తో ముగియనుంది. కానీ ఇంతవరకు ఎన్నికల ఊసేలేదు. మరో ఆరు నెలల్లో త్రిసభ్య కమిటీలకే బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

## ప్రాచీన సంస్కృతిని కాపాడుకుందాం

**-డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం**



**రేణిగుంట, జనవరి 17 ప్రభాతవార్త:**
ప్రాచీన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రష్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. రేణిగుంట మండలం కొత్తపాళెం గ్రామంలో రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పండుగలు తెలుగు సంస్కృతికి చిహ్నాలు అన్నారు. ఎన్నో తరాలుగా ఎన్నో ఆచారాలు పద్ధతులు సాంప్రదాయంగా సంక్రమించాయన్నారు. తెలుగు సంస్కృతిని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు పంపిణీ చేశారు. మొదటి బహుమతిగా సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా ముగ్గు గీసిన వైష్ణవికి మిక్సీ, రెండో బహుమతిగా మోహనమ్మకు గ్యాస్ స్టౌవ్, మూడో బహుమతిగా మమతకి రైస్ కుక్కర్ బహుకరించడంతో పాటు ప్రోత్సాహకంగా 4,5వ బహుమతిగా భువనేశ్వరి, భార్గవిలకు 500 రూపాయలు నగదు అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 75 మంది మహిళలకు క్యారియర్ బాక్సులను ఇచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది తిరుమలరెడ్డి, నళిని కుమారి, పసల మునిరెడ్డి, సుబ్రహ్మణ్యం, సురేంద్ర, పట్నం వీరయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## టిఎస్‌పిఎస్‌సి గ్రూఫ్ 1 మెయిన్ పరీక్షకు సెలెక్టైనభాగ్యలక్ష్మి

**తిరుపతి (విద్య), జనవరి 17 ప్రభాతవార్త :**



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర పరిశోధనా విద్యార్థి జి. భాగ్యలక్ష్మి టిఎస్‌పిఎస్‌సి గ్రూప్ 1 సర్వీసెస్‌లో ప్రిలిమినరీ పరీక్ష పాసై మెయిన్ పరీక్షకు సెలెక్ట్ అయ్యారు. వివాహం అయిన తరువాత డిగ్రీ, పిజి కంప్లీట్ చేసి తనపిల్లలతో పాటు తను కూడా చదువుతూ అంచలంచెలుగా ఎదిగారు. వారి పిల్లలు, అమ్మాయి డాక్టర్ కోర్సులో చేరితే అబ్బాయి ఇంజనీరింగ్ చదివారు. వారితో పాటు భాగ్యలక్ష్మి మహాత్మ జ్యోతిబాపులే తెలంగాణ బిసి రెసిడెన్సీయల్ డిగ్రీ కాలేజి వర్గల్లో లెక్చరర్‌గా టిఎస్‌పిఎస్‌సి పరీక్ష నందు సెలెక్ట్ అయ్యి ఉద్యోగం చేస్తూ ఆర్థిక శాస్త్రం పై ఉన్న మక్కువతో పిహెచ్‌డి నందు 2022 శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నందు చేరారు. నిరంతరం పోటీ పరీక్షలకు సనర్ధం అవుతూ ఉంటారు. అక్టోబర్ 16, 2022 సంవత్సరం జరిగిన టిఎస్‌పిఎస్‌సి గ్రూప్ 1 నందు భాగ్యలక్ష్మి మెయిన్ పరీక్షకు సెలెక్ట్ అయినందుకు భాగ్యలక్ష్మిని వారి పిహెచ్‌డి గైడ్ డా.పి. మాధవి, డిపార్ట్‌మెంట్ హెడ్ డా. పి నీరజ, డా. ఎం. పద్మావతి అభినందించారు.

## కొండచుట్టు ఉత్సవాలకు "పులివర్తి నాని" సారె

**-అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.17 లక్షలు గ్రానైట్**

**చంద్రగిరి, జనవరి 17 ప్రభాతవార్త:**



సంక్రాంతి మహోత్సవాలలో భాగంగా నిర్వహించే కొండచుట్టు ఉత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారికి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని మంగళవారం సారెను సమర్పించారు. ఈ నెల 14 నుండి 18 వరకు అమ్మవారికి సంక్రాంతి మహోత్సవాలను ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ చైర్మన్, ఈఓ సాదరంగా ఆహ్వానించారు. ఆలయం వద్ద అర్చకులకు సారెను అందజేశారు. ఆలయంలో అమ్మవారికి అర్చనలు జరిపించి, దర్శనం ముగించుకున్న ఆయన అర్చకుల ఆశీ స్సులు అందుకున్నారు. అనంతరం ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణా రెడ్డి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరడంతో స్పందించిన నాని తనవంతుగా రూ.17 లక్షలు విలువైన గ్రానైట్‌ను వితరణ చేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## జగనన్న కాలనీలో అధికారులు పర్యవేక్షణ కరువు

**-ఇంటి నిర్మాణాల్లో కనిపించని వేగం**

**తొట్టంబేడు, డిసెంబర్ 17 ప్రభాతవార్త :**



నిరుపేదల కల నెరవేరాలన్న లక్ష్యంతో ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల మేరకు అందరికీ ఇంటిస్థలాలు అందించేందుకు రంగం సిద్ధం చేశారు. ఏళ్ళ తరబడి అభివృద్ధికి నోచుకోని బీడికాలనీలో ఇంటిస్థలాలు అందించేందుకు ఎంఎల్ఏ ఆదేశాలతో అధికారులు పరుగులు తీస్తున్నారు. అయినా ఇంటి నిర్మాణాల్లో పురోగతి కనిపించడం లేదు. అన్ని గ్రామాల్లో నిరుపేదలైన లబ్ధిదారులను గుర్తించి ఇంటిస్థలాలను అందించారు. మండలంలో మొత్తం 1325మంది లబ్ధిదారులను గుర్తించి వారికి ఇంటిస్థలాలను అందించేందుకు చర్యలుతీసుకుంటున్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారునికి 1.50సెంట్లు స్థలాన్ని అందిస్తుండగా, మరోసెంటు స్థలంరోడ్డు కోసం కేటాయించారు. పట్టా మాత్రం 1.50సెంటుకే ఇస్తారు. ఎకరాకు 40మంది చొప్పున లబ్ధిదారులకు పట్టాలు అందిస్తున్నారు. ఇటీవల ఆర్డీవో కెఎస్.రామారావు బీడికాలనీలోఅసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణాలను గుర్తించి ఎందుకు వేగవంతం చేయలేదో అని పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ ఇంజనీర్లకు క్లాస్‌తీసుకున్నారు. అయినా ఇప్పటి వరకు బీడికాలనీలో 536ఇండ్లకు కేవలం 27 ఇండ్లు పూర్తిగాగా మిగిలిన ఇండ్లు వివిధ దశల్లోనే అసంపూర్తిగా ఉన్నాయి. గతంలో బీడికాలనీలో నిర్మించిన ఇళ్ళలో ఎవ్వరు ఉండలేని పరిస్థితి నెలకొనడంతో అవిపాడుబడిపోయాయి. దీంతో శిధిలావస్థకు చేరుకున్న ఇళ్ళను నేలమట్టంచేసి ఆప్రదేశాల్లో కొత్తగా ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే ఇక్కడ సివిల్‌సప్లయిస్‌గోడౌన్ నిర్మాణం పూర్తయింది. ఇక పక్కనే మరోగోడౌన్ నిర్మాణం జరుగుతోంది. తొట్టంబేడు పంచాయతీకి చెందిన నిరుపేదలు 200మందికి పట్టాలు అందిస్తున్నారు. పంచాయతీల వారీగా పరిశీలిస్తే కాసరం 98, పిల్లమేడు 65, పెద్దకనపర్తి 87, చియ్యవరం 127, చోడవరం 2, గుండేలిగుంట 30, పూడి 5, శేషమనాయుడుకండ్రిగ 10, పెన్నలపాడు 10, కొణతనేరి 40, ఇలగనూరు 9, పొయ్య, లింగమనాయుడుపల్లి 100, రౌతుసూరమాల 39, తాటిపర్తి 17, తంగేళ్ళపాళెం 57, సాంబయ్యపాళెం 23, కారాకొల్లు 30, చిట్టత్తూరు 72, కంచనపల్లి 21, బోనుపల్లి 46, చిన్న సింగమాల 39, పెద్దకన్నలి, కొత్తకండ్రిగ, బసవయ్యపాళెం 104, తొట్టంబేడు 179మందికి పట్టాలను అందించారు. ప్రస్తుతం అత్యధికంగా మండల కేంద్రానికి సమీపంలో ఉన్న బీడికాలనీ ఓ మినీ జగనన్న కాలనీలగా తయారైంది. ఈకాలనీకి జగనన్న కాలనీగా మార్చడానికి ఉత్తర్వులు ఇచ్చారు. ఇక్కడి కాలనీకి నీటిని అందించడంలో సర్పంచ్ సుబ్బయ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నా ఇంటి నిర్మాణాలు మాత్రం వేగవంతం చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు దృష్టిపెట్టి కాలనీల ఇండ్లను సత్వరం పూర్తిచేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80లక్షలు సరిపోవడం లేదని లబ్ధిదారులు చెబుతున్నా అధికారులు మాత్రం మహిళా సంఘాలు, వెలుగు ద్వారా రుణాలు అందించి ఎస్‌సి, ఎస్‌టిలకు ఇంటినిర్మాణాలను కట్టించేందుకు చర్యలుతీసుకుంటున్నామని పేర్కొంటున్నారు. మరి ఇది అమలు జరిగుతుందా అన్న సందేహం కలుగుతోంది.

## ఫ్లెక్సీలు చించివేయడం దారుణం

**శ్రీకాళహస్తి, జనవరి 17 ప్రభాతవార్త**



సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో తెలుగు దేశంపార్టీ ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి ఆధ్వర్యంలో 14వ తేదీన సైకోపోవాలి..సైకిల్ రావాలని అన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే వీటిని చించివేయడం బాధాకరమని గురవారెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ తరపున ప్రజల పక్షాన ఖండిస్తున్నామని ప్రజాస్వామ్యంలో ఇది మంచిపద్దతి కాదని స్థానికంగా పరిపాలన చేసేవారికి మరి రాష్ట్రంలో పరిపాలన చేసే వారికి హెచ్చరించారు. మూడున్నరేళ్ళలో చేసే పనులన్నీ కూడా సైకో పరిపాలనకు నిదర్శనమని తీవ్రస్థాయిలో దుయ్య బట్టారు. ఫ్లెక్సీలు చించడాన్ని నిదర్శనంగా తెలుగుదేశంపార్టీకి భయపడు తున్నట్టే అని విమర్శించారు. రాష్ట్రంలో రాజకీయాల్లో కొనసాగే వారని తెలుగుదేశం పార్టీ తరపున గుర్తు చేస్తున్నామని ఇవన్నీ కూడా ప్రజాస్వామ్య వ్యవస్థల్ని అధికారపార్టీ పరిపాలనలో విధ్వంసం చేసే విధంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో రాష్ట్రంలో అధికార పార్టీఫ్లెక్సీలు ఉండేలా ఆటవిక చర్యలే కొనసాగాలని మరి విపక్షాలకు ఫ్లెక్సీలు కట్టుకునే స్వేచ్ఛలేదా అని సూటిగా ప్రశ్నించారు. కారులో వచ్చి ఓవ్యక్తి ఫ్లెక్సీను చించివేయడం సిసి కెమెరాల్లో దృశ్యాలను ప్రజలముందు ఉంచుతామన్నారు. ఇకనైనా అధికారపార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రవర్తన మార్చుకుని ప్రజాస్వామ్యానికి విలువిచ్చి విలువలను కాపాడుకోవాలని తెలిపారు.

## రామాపురం ఎస్టీ కాలనీ చిన్నారులకు దుస్తులు పంపిణీ

**శ్రీకాళహస్తిరూరల్, జనవరి 17 ప్రభాతవార్త :**



యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలంలోని రామాపురంఎస్టీ కాలనీకి చెందిన గిరిజన పిల్లలకు ఉచితంగా సాయంత్రం పూట విద్యను చెప్పడం ప్రారంభించి వారికి కొత్త దుస్తులు పంపిణీ చేయడం జరిగిందని యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా మునిశేఖర్ మాట్లాడుతూ గిరిజనులకు విద్యను అందించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఇందులో భాగంగానే గిరిజనులు చదువుకోకపోవడం వల్లనే ఆర్థికంగా మరియు అన్ని రంగాల్లోను వెనుకబడుతున్నారని తెలిపారు. గిరిజనులు విద్యలో రాణించి భవిష్యత్తులో మంచి స్థాయిలో ఎదగాలనేది యువనేస్తం అసోసియేషన్ లక్ష్యం అన్నారు. ఇందులో భాగంగానే గ్రామాలకు దూరంగా ఉన్న ఎస్టీ కాలనీలో ఉన్న పిల్లలకు తమ వంతు సాయంగా యువనేస్తం అసోసియేషన్ సారధ్యంలో సాయంత్రంపూట ట్యూషన్‌లు చెప్పిస్తున్నామని తెలిపారు. గిరిజన చిన్నారులకు సాయం చేయడానికిదాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ హనుమంత్‌నాయక్, సభ్యులు నాగమణి, వెంకటేష్, ట్యూషన్‌టీచర్ స్రవంతి, ఎస్టీ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ఓజిలి తహశీల్దార్ ఆదేశాలు బేఖాతరు

**– హెచ్చరిక బోర్డు తొలగింపు**



**ఓజిలి, జనవరి 17 ప్రభాతవార్త :**
ఓజిలి మండలం రాజానగరం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 73లో రహదారికి పక్కన ఉన్న సుమారు కోటి రూపాయలు విలువైన దాదాపు 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన విషయం తెలిసిందే. కొందరు వ్యక్తులు ఈ ప్రభుత్వ భూమి విషయంపై వార్త తెలుగు దినపత్రికలో ప్రచురితమైంది. వార్త కథనాలకు స్పందించిన ఓజిలి తహశీల్దార్ లాజరస్ జనవరి 4న ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బ ోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా, ప్రవేశించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించి బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఈ బోర్డును ల్యాండ్ మాఫియా తొలగించి వేశారు. తహశీల్దార్ ఆదేశాలను బేఖాతరు చేసి, హెచ్చబోర్డులను లెక్కచేయకపోవడంపై ల్యాండ్ మాఫియా ఎంతకు బరితెగించిందో దీన్ని బట్టి అర్థమవుతుంది. ఈ సంఘటనపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎంపిపి

**సూళ్లూరుపేట, జనవరి 17 ప్రభాతవార్త :**



గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధించాలంటే అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం పాటించి వారితో కలిసిమెలిసి పనిచేయాలని సూళ్లూరుపేట ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సూళ్లూరుపేట మండలంలోఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తమవంతు ప్రయత్నం చేస్తున్నారని, కానీ సర్పంచులకు, ప్రజాప్రతినిధులకు తగిన సమన్వయం లేకపోవడంతో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి కావడం లేదన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం మంచినీటి సమస్య మండల పరిధిలో లేదని, వేసవిలో వచ్చినప్పటికీ దాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసి ఉన్నామన్నారు. మండలంలో విద్యుత్ శాఖకు సంబంధించి అవసరమైన చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి ఉన్నారని, వాటిని తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని పలువురు సర్పంచులు కోరారు. వ్యవసాయాధికారి కవిత మాట్లాడుతూ రైతులకు సంబంధించి ప్రభుత్వంచే కిసాన్ యోజన, రైతుభరోసా కార్యక్రమాలకు రూ.13.40 కోట్లు మండలంలో లబ్ధిదారులకు అందిందని అన్నారు. ఈ రబీ సీజన్‌లో పంటలు పండించుకునేందుకు రైతులకు తగు సూచనలు అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలవారీగా ఎంపిపి అనిల్‌కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రమీలరాణి, జడ్పిటిసి సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఘనంగా గోపూజ

**కాణిపాకం, జనవరి 17 ప్రభాతవార్త:**



సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పుస్కరించు కుని ముక్కనుమ రోజు మంగళవారం కాణి పాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవ స్థానం గోశాలలో ఘనంగా గోపూజ నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ, కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంల సంయుక్త ఆధ్వర్యంలో ఆలయ గోశాలలో గోపూజ కార్యక్రమంను సంప్రదాయబద్ధంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆలయ ఈఓ ఎగ్గిడి వెంకటేశు ఆధ్వర్యంలో గోశాల వద్ద శ్రీకృష్ణుని చిత్రపటంతో పాటు గోమాత చిత్రపటాన్ని వుంచి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గోశాలలో వున్న పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, వేదపండితులు గోశాలలోని గోమాతలకు సంప్రదాయబద్ధంగా అభిషేకం నిర్వహించారు. అలాగే గోమాతలకు ఆలయ అధికారులు మేతను అందించారు. ఆలయ ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరెం డెంట్ కోదండపాణి, అర్చకులు , వేదపండితులు, ఉభయదారులు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

## గణనాధునికి ఘనంగా చందనాలంకార సేవ

**కాణిపాకం, జనవరి 17 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారికి మంగళవారం చందనాలంకార సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో ముక్కనుమ రోజున స్వామివారికి చందనా లంకా రసేవను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు మంగళవారం స్వామివారికి ఈ కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకంకు చెందిన సల్లా శివశంకరన్ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయదారులు పగలు వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని చందనం, దూదితో శోభాయమానంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి స్వామివారికి కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ధి, బుద్ధి సమేతుడైన గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఊంజల్‌సేవను నిర్వహించారు. ఆలయ ఈఓ వెంకటేశు, అధికారులు, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

**-ఏపీ ఈఆర్సీ ఛైర్మన్ సీసీ నాగార్జునరెడ్డి**

**తిరుపతి ప్రెస్‌క్లబ్, జనవరి 17 ప్రభాతవార్త:**



విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఈనెల 19 నుండి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్సీ) పర్చువల్ పద్ధతిలో ప్రజాభిప్రాయ సేకరణకు పగడ్బందీ ఏర్పాటు చేసినట్లు ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ సీవీ.నాగార్జునరెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్ మూడు విద్యుత్ పంపిణీ సంస్థలకు సంబంధించిన అధికారులు పాల్గొంటారన్నారు. ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో మంగళవారం నమూనా(మాక్ డ్రిల్) కార్యక్రమంను నిర్వహించారు. ఈనెల మూడు రోజుల పాటు జరుగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిస్కింలకు సీఎండీ సూచించారు. ఎక్కువ మంది వినయోగదారులు పాల్గొనేలా విద్యుత్ సిబ్బందితో ప్రచారం నిర్వహించాలన్నారు. సర్కిల్, డివిజన్ కార్యాలయాల నుండి వినియోగదారులు, అభ్యంతరదారులు తమ సలహాలు,సూచనలు అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు వీలుగా తగవిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గత రెండేళ్ళ తరహాలోనే ఈఏడాది కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలోని సమీప విద్యుత్ అపరేషన్ కార్యాలయాల నుండి ఎక్కడ నుండైనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అభిప్రాయాలను తెలవపచ్చునని తెలిపారు. ఈకార్యమ్రాన్ని ప్రజలు వీక్షించే విధంగా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. నమూనా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ సీవీ నానార్జునరెడ్డితో పాటు సభ్యులు ఠాకూర్ సింగ్, సెక్రటరీ కె.రాజ బాపయ్య, సీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మనాభరెడ్డి, ఎస్పీడీసీఎల్ ఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు, మూడు విద్యుత్ పంపిణీ సంస్థల డైరక్టర్‌లు, సూపరెండెంటత్ ఇంజనీరింగ్‌లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

**I, BUTTIMANI RAMA KRISHNA** S/O BUTTIMANI SUBBAIAH(OLD NAME), CHANGE MY NAME IS **MALLELA KRISHAIAH** S/O MALLELA SUBBAIAH(NEW NAME) RESIDING AT 6-1, Thurakapalli, M V Palli,KV.PALLI, ANNAMAYAA DISTRICT. Wife Passport No: L4714156

# యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి : గాలి భానుప్రకాష్

**పుత్తూరు, జనవరి 17 ప్రభాతవార్త :**



శారీరక, మానసిక ధృఢత్వం కోసం యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పుత్తూరు మునిసిపాలిటీ మూడో వార్డుకు చెందిన ఆర్.సి.యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు మంగళవారం ఆయన బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి క్రీడాకారులను ప్రోత్సహించిందని తెలిపారు. టిడిపి హయాంలో ఆంధ్రప్రదేశ్ జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వేదికగా నిలిచిందన్నారు. ప్రస్తుతం క్రీడారంగం ప్రోత్సాహం లేక నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడాకారులను పట్టించుకునే వారు లేరని, ఫలితంగా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి రావడం లేదని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, బిసి సెల్ చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, నిర్వాహకులు ప్రసాద్, రాజ్‌కుమార్, కేశవ, నాయకులు ఎన్.ఎన్.ధనపాల్, బాలసుబ్రమణ్యంరాజు, చిన్నబ్బ, మణి, ఈశ్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.